క్లుప్తంగా

దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత



రామన్నపేట: వరంగల్ చౌరస్తాలో దొరికిన సెల్‌ఫోన్‌ను పాపయ్యపేట చమన్‌కు చెందిన గోపాల్.. ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించాడు. మండిబజార్‌కు చెందిన యువతి ఆటోలో తన సెల్‌ఫోన్ మరిచిపోయింది. ఆటోలో నుంచి ఆ సెల్‌ఫోన్ వరంగల్ చౌరస్తాలో కింద పడిపోయింది. ఆ ఫోన్ గోపాల్‌కు దొరకగా తమకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు గోపాల్‌ను పోలీసులు అభినందించారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ తూర్పు కోటలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి హంస వెంకన్న, స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఉదయం 4.30 గంటలకు పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి పెద్దమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కోళ్లు, మేకలు, పొటేళ్లను బలిచ్చి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బోగి సురేష్, బిల్లా కవిత, శ్రీకాంత్, శ్రీనివాస్, రజిత, సంగరబోయిన చందర్, సిరబోయిన వాసు పాల్గొన్నారు.

సులక్ష్య సేవా సమితి సేవలు అభినందనీయం



కాజీపేట అర్బన్: సులక్ష్య సేవా సమితి సామాజిక సేవలు అభినందనీయమని ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయిఅశ్రిత్ తెలిపారు. 31వ డివిజన్ న్యూశాయంపేటలోని శ్రీవ్యాస ఆశ్రమంలో సులక్ష్య సేవా సమితి 11వ వార్షికోత్సవాన్ని సాయిఅశ్రిత్ ప్రారంభించి మాట్లాడారు. 2013లో ఉగాది పండుగ రోజు ప్రారంభమైన సులక్ష్య సేవా సమితి సేవలు పదకొండు ఏళ్లుగా కొనసాగించడం ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత అంపశయ్య నవీన్, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందువ సంతోష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అన్నదానం



కాజీపేట రూరల్: ఉగాది పండుగను పురస్కరించుకొని కరుణామయ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్‌లో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమకొండ, కాజీపేట రోడ్ల పక్కన, కాజీపేట జంక్షన్ రైల్వే ప్రాంగణంలోని అనాథలు, వృద్ధులు, అభాగ్యులకు సొసైటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కరుణామయ సొసైటీ అధ్యక్షుడు బొచ్చు నరేష్, భైరపాక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



వరంగల్: రానున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఏనుమాముల పోలీసు స్టేషన్ పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లి గ్రామంలో కేంద్ర భద్రతా దళాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించరాదని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, నర్సింహరావు పాల్గొన్నారు.

నిట్‌లో వీధి కుక్కల స్వైరవిహారం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని క్యాంపస్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ విద్యార్థులపై దాడికి దిగుతున్నాయి. తరగతి గదులు, ల్యాబ్‌లు ఆడిటోరియం, అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియం వద్ద తిష్ట వేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధి కుక్కల బెడదను అరికట్టాలని విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కోరుతున్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



మెట్టుగుట్టపై పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు



పిండి వంటలు పంచుతున్న అనితారెడ్డి



ఖిలా వరంగల్: శివనగర్‌లోని ఆర్యవైశ్య భవనంలో..



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వినయ్‌భాస్కర్

మడికొండ: నగర వ్యాప్తంగా ఉగాది వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కలిగించారు. సాయంత్రం 6గంటలకు ఉగాది నూతన సంవత్సర పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్ యాదవ్, వస్కుల ఉమ, జ్ఞానేశ్వరి, అర్చకులు సత్యనారాయణ శర్మ, విష్ణువర్ధన చార్యులు, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హనుమకొండ కార్యాలయంలో..

హన్మకొండ: క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆకాంక్షించారు. బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఉగాది పండుగ, క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. పండితుడు జగన్ పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్వధార్ ఆశ్రమంలో..

హనుమకొండ కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీలోని స్వధార్ ఆశ్రమంలో నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ కరుకాల అనితారెడ్డి ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిలో తయారు చేసిన పిండివంటలు, పులిహోర, ప్రసాదాన్ని ఆశ్రమానికి తీసుకువచ్చి ఆశ్రయం పొందుతున్న మహిళలు, బాలికలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగ అంటే తాము మాత్రమే సంతోషంగా ఉండడం కాదని, మరో పదిమందికి ఆనందాన్ని పంచడమే నిజమైన పండుగ అన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు శైలజ, సుజాత, కరుకాల ఆర్విక పాల్గొన్నారు.

శివనగర్‌లో..

ఖిలా వరంగల్: క్రోధి నామ సంవత్సరం, ఉగాది పర్వదినం సందర్భంగా శివనగర్ ఆర్యవైశ్య భవనంలో మంగళవారం సాయంత్రం సంఘం అధ్యక్షుడు మంచాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అంతకుముందు ఆర్యవైశ్య మహిళలు, భక్తులు లలితా పారాయణం చేశారు. అనంతరం మంచాల కృష్ణమూర్తి చేతుల మీదుగా పంచాంగాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అంచూరి కిషోర్, అయిత కృష్ణమూర్తి, యెన్నంపెల్లి శ్రీధర్, ప్రతాపనేని రవీందర్, గుముడువెల్లి వెంకన్న, ఉప్పుగళ్ల సుధాకర్, వంగపెల్లి అశోక్, కూరగాయల శ్రీనివాస్, రావికంటి అశోక్, ఓరుగంటి విమల, మంచాల నాగరాణి, ప్రసాద్, రాధిక, ములుగు రమ, సోమవందన, ఉప్పల అంజనీదేవి, త్రివేణి, శైలజ పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి దేవాలయంలో

ఖిలా వరంగల్: శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం, సాయంత్రం డాక్టర్ కాళేశ్వరం సుమన్ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

హసన్‌పర్తిలో..

హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. పురోహితుడు రమేష్‌శర్మ పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్, కార్యదర్శి చిదర పురవర్ధన్, కోశాధికారి నాగమళ్ల మాధవ శంకర్, క్లబ్ రీజియన్ సెక్రటరీ అప్పని శంకర్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ నాగమళ్ల సుధీర్, మాజీ అధ్యక్షుడు గౌరిశెట్టి కృష్ణమూర్తి, భీష్మనాథం, సంద్రు నాగేందర్ పాల్గొన్నారు.

నాగవీరేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 18వ డివిజన్ లేబర్ కాలనీలోని పంచముఖ నాగవీరేశ్వరాలయంలో ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివత్రి భోగేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో భక్తాలతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను తెలియజేసే ఉగాది

దేశాయిపేట: సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడానికి ఉగాది వేడుకలు ఎంతో ఉపయోగపడతాయని కృష్ణవేణి కళాసమితి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ వట్నాల శ్రీనివాస్ అన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని కృష్ణవేణి కళాసమితి ఆధ్వర్యంలో కొత్తవాడలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తమ ఆచారాలు, సంప్రదాయాలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని గుర్తుచేశారు. అనంతరం అమృతవర్షిని కవితా సంకలనం పుస్తకాన్ని రచించిన కవి పాడిశెట్టి సాయన్న చార్యులను జీవన సాఫల్య పురస్కారంతో పాటు ప్రశంసపత్రం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు సిరాజొద్దీన్, నక్క కుమారస్వామి, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీధర్ స్వామి, అరవింద నరసింహ స్వామి, కృష్ణవేణి స్కూల్ డైరెక్టర్ మాలతి, డీన్ కల్యాణ్ రామ్, తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ పఠనం చేస్తున్న భోగేశ్వరశాస్త్రి



దేశాయిపేట: ఉగాది వేడుకల్లో అమృతవర్షిణి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, కళాకారులు



హసన్‌పర్తి: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో..

శ్వేతార్క ఆలయంలో సప్తవర్ణాభిషేకం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను అర్చకులు మంగళవారం నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చరణలతో సప్తవర్ణాభిషేకాలతో అభిషేకాలు జరిపించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడికి నిత్య కల్యాణ వేడుకలు నిర్వహించారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ సమావేశ మందిరంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు మహాన్నదానం చేశారు. ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో నవరాత్రోత్సవాలు



రాజరాజేశ్వరి మాత



అయ్యప్ప ఆలయంలో ..

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో మంగళవారం తార నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి కమల పూలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

అయ్యప్ప దేవాలయంలో..

వరంగల్ భద్రకాళిరోడ్డులోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఉగాదిని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకుడు టీఆర్ బాలసుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో అర్చకుడు గణపతిశర్మ అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు.

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌శర్మ

కాజీపేట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ మంగళవారం ప్రారంభించారు. అభయాంజనేయుడికి భక్తుల కోలాహలం మధ్య అభిషేకం, సింధూర లేపనం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయంలోని సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. పండితులు గణపతి పూజ, నవగ్రహారాధన, కలశ స్థాపన చేశారు. ఈనెల 17న ఆలయ ఆవరణలో జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని శ్రీనివాస్ శర్మ కోరారు. కార్యక్రమంలో పండితులతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రియాజ్, మల్లయ్య

ఖిలా వరంగల్: మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న రంజాన్ పర్వదినాన ఈద్ - ఉల్ - ఫీతర్ సామూహిక నమాజ్‌ను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎండీ.రియాజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ ఆదేశాల మేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ ఈద్గాలో జరగనున్న సామూహిక ప్రార్థనల ఏర్పాట్లను ముస్లింలతో కలిసి వారు మంగళవారం పరిశీలించారు. అనంతరం రియాజ్, మల్లయ్య మాట్లాడుతూ పవిత్రమైన ఖురాన్ ప్రకారం ప్రతి ముస్లీం రంజాన్ పండుగ రోజు ఉదయం ఐక్యంగా ఆధ్యాత్మిక చింతనతో నమాజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ.షఫియొద్దీన్, ఎండీ.నూరొద్దీన్, ఎండీ.గౌస్, యాకూబ్, చాంద్‌పాషా, ఎండీ.మగ్దుమ్, ఎండీ.షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరం



ఉగాది పచ్చడి వితరణ చేస్తున్న వేణు

నయీంనగర్: శీతల పానీయాలు వద్దు - సహజ పానీయాలు ముద్దు అంటూ జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూసీ జంక్షన్‌లో ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు మాట్లాడుతూ కూల్‌డ్రింక్స్ తయారీలో అనేక హానికరమైన రసాయనిక పదార్థాలు కలుస్తాయని, అవి శరీర కణాల్లోని ఆక్సిజన్ నిల్వలను తగ్గిస్తాయన్నారు. తద్వారా క్యాన్సర్‌తో పాటు ఇతర అనేక రోగాలకు దారితీయవచ్చని చెప్పారు. కూల్‌డ్రింక్స్‌లో వాడే కృత్రిమ తీపి పదార్థం చక్కెర కంటే 200 రెట్లు తీయగా ఉండి క్యాన్సర్‌కు కారకమవుతుందని వివరించారు. పర్యావరణ విభాగం కన్వీనర్ ధర్మప్రకాష్ మాట్లాడుతూ ఎలాంటి పోషక విలువలు లేని కూల్‌డ్రింక్ తాగడం వల్ల లాభం కంటే నష్టాలే అధికమన్నారు. సహజ పానీయాలు అయిన నిమ్మరసం, చెరుకు రసం, మసాలా మజ్జిగ, కొబ్బరినీళ్లు, రాగి అంబలి, వేసవి పానకం తాగడం ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, ప్రవీణ్, అగ్రణ్య, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కబళిస్తున్న ఈత సరదా..!

- నగరం చుట్టూ ప్రమాదకరమైన బావులు, చెరువులు
- కనిపించని హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డులు లేని బెస్తం చెరువు



తిమ్మాపురం శివారులోని వ్యవసాయ బావి

ఖిలా వరంగల్: వేసవి ఎండలు మండుతున్నాయి. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఈతను ఆశ్రయిస్తుంటారు. వేసవిలోనే ఈత నేర్చుకునేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతుంటారు. ఈత కొలన్లు, వ్యవసాయ బావులు, కుంటలు, చెరువుల వద్దకు వెళ్తుంటారు. అలాంటి చోట తల్లిదండ్రులు, ఈతవచ్చిన వారి పర్యవేక్షణ తప్పనిసరి. చిన్నారుల భద్రత పరంగా అన్ని సౌకర్యాలు, నిష్ణాతులైన శిక్షకులు, సిబ్బంది ఉన్న ఈత కొలనులనే ఎంచుకోవాలి. లేకుంటే చిన్నారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈతరాక కొంతమంది, సరైన జాగ్రత్తలు పాటించక మరికొంత మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం.

ఈత నేర్చుకోవాలనే తపనతో..

వరంగల్ ట్రైసిటీతోపాటు ఖిలా వరంగల్ మండల పరిధిలో తిమ్మాపురం, అల్లీపురం, మామునూరు, జక్కలొద్ది, నక్కలపెల్లి, గాడిపెల్లి, గుంటూరుపల్లి, దూపకుంట, స్తంభంపల్లి వసంతాపూరం, ఆదర్శనగర గ్రామాల్లో ఎక్కువగా చెరువులు, బావులు ఉన్నాయి. పిల్లలు, పెద్దలు ఉక్కపోత నుంచి ఉపశమనం, వ్యాయామం కోసం చెరువులు, బావుల్లో స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఈక్రమంలో ఈత సరదా ఒక్కోసారి ప్రాణాల మీదికి తెస్తుంది. ఈత కొట్టే ఉత్సాహంలో నీటిలో ఆడే ఆటలే మృత్యుగంటలై మోగుతున్నాయి. గతేడాది ముగ్గురికి పైగా విద్యార్థులు, చిన్నారులు ఈత కోసం వెళ్లి మృతి చెందారు. తాజాగా ఏనుమాముల పరిధి ముసలమ్మకుంట చెరువులో ఈతకు దిగి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన సంగతి తెలిసిందే.

కానరాని హెచ్చరిక బోర్డులు

నగర పరిధిలో ఇటీవల జరిగిన ఘటనలు

- గతనెల 25న హోలీ పండుగ రోజు హసన్‌పర్తి మండలం పలివేల్పులు, గుండ్లసింగారం సమీపంలో ఎస్సారెస్పీ కాల్వలోకి స్నానాలకు వెళ్లిన ముగ్గురు గల్లంతై మృత్యు ఒడిలోకి వెళ్లారు.
- గతనెల 30వ తేదీన హసన్‌పర్తి పరిధి రెడ్డిపురం సమీపంలోని ఓ కుంటలో బీటెక్ విద్యార్థి పింగిలి నాగరాజు (19) ఈతకు వెళ్లి మృతిచెందాడు.
- ఈనెల 4న వరంగల్ నగరంలోని ఎంహెచ్‌నగర్‌కు చెందిన దుప్పటి రంజిత్ (28) ఏనుమాములలోని ముసలమ్మకుంటలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు.

వరంగల్ ట్రైసిటీతోపాటు ఖిలా వరంగల్ మండల పరిధిలోని ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. చెరువుల చుట్టూ రక్షణగా కంచెలు ఉండడం లేదు. నగరాన్ని ఆనుకొని కెనాల్ ఉన్నా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. విలీన గ్రామాల్లో చెరువులు, కుంటలు, బావులు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. మట్టి కోసం అక్కడక్కడా 20 అడుగుల లోతు వరకు తవ్వి వదిలేశారు. వాటిలో నీరు చేరడంతో లోతును అంచనా వేయక చాలామంది మృత్యుఒడిలోకి వెళ్తున్నారు. అలాంటి ప్రమాదకర స్థలాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సెలవుల్లో అప్రమత్తం


ఈత సరదాతో కోరి ముప్పు తెచ్చుకోవద్దు. ప్రధానంగా సెలవు రోజుల్లో ఎక్కువగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నారు. ఈ క్రమంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలి. చెరువులు, వ్యవసాయ బావులు, కాల్వల వద్దకు వెళ్లకుండా చూడాలి. పిల్లల ఆసక్తిని గమనించి అన్ని జాగ్రత్తలు తీసుకుని ఈత నేర్పుతూ వారి సరదా తీర్చాలి.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

ఈతరాని పిల్లలు తప్పకుండా తమ తల్లిదండ్రుల పర్యవేక్షణలో రబ్బరు ట్యూబ్‌లను కట్టుకొని నీటిలోకి దిగాలి. బావులు, చెరువు గుంతల్లోకి దూకడం వంటివి చేయొద్దు. ఈత వచ్చిన వారి పర్యవేక్షణలోనే నేర్చుకోవాలి. ప్రమాదకర హెచ్చరిక బోర్డులున్న చోట నీటిలోకి దిగరాదు, లైఫ్‌జాకెట్లు బెండుతో తయారు చేసిన వస్తువులను కట్టుకుని మాత్రమే నీళ్లలోకి దిగాలి.



కొలనులో ఈత నేర్చుకుంటున్న చిన్నారులు



మధ్యకోటలోని గుండు చెరువు

ప్రమాదాల నివారణకు చర్యలు



స్టేషన్ పరిధిలోని చెరువులు, బావులు, క్వారీ గుంతల వద్ద నిఘా పెట్టాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. ఈత కొట్టే సమయంలో స్వీయ జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు తప్పవు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో మాత్రమే చిన్నారులు ఈత నేర్చుకోవాలి. ఆరోగ్యాన్ని చేకూర్చే ఈత విషయంలో కచ్చితంగా శిక్షణ తీసుకోవాలి. ఇప్పటికే ప్రమాదకరమైన వ్యవసాయ బావులు, చెరువులను గుర్తించాం. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

- రవికుమార్, ఇన్‌స్పెక్టర్, మామునూరు

అంకెలు దాచి.. పోలీసులను ఏమార్చి..

- ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్న వాహనదారులు
- జరిమానాలు పడకుండా తప్పించుకు తిరుగుతున్న వైనం



నగరంలో తిరుగుతున్న నంబర్ ప్లేట్‌లేని బైక్‌లు

కాజీపేట: రహదారి భద్రతా నియమావళిని అతిక్రమించిన వాహనాలను ఆపి జరిమానాలు విధించడం ఒకప్పటి పద్ధతి. ఈ-చలాన్ విధానం వచ్చాక ఆన్‌లైన్ జరిమానాల విధింపు జోరందుకుంది. ముఖ్యంగా మితిమీరిన వేగానికి కళ్లెం వేసేందుకు వాహనదారుడికి తెలియకుండానే స్పీడ్‌గన్ల ద్వారా ఫొటోలు తీసి జరిమానాలు విధిస్తున్నారు. సీసీ కెమెరాలు ఫొటో తీసే విధానంతో కమాండ్ కంట్రోల్ ద్వారా వాహనదారులకు జరిమానాలు బాదేస్తున్నారు. రోడ్డుపై వాహనం నిలిపి ఉంచినా.. తప్పుడు దారిలో నడిపినా.. హెల్మెంట్ ధరించకపోయినా.. అతివేగంతో వెళ్లినా, పరిమిత వ్యక్తులకు మించి ప్రయాణించినా, సిగ్నల్ జంప్ చేసినా కెమెరాలు క్లిక్‌మంటాయి. వాటన్నింటిని నుంచి తప్పించుకునేందుకు కొందరు వాహనదారులు నంబర్ ప్లేట్ కనిపించకుండా అతితెలివి తేటలు ప్రదర్శిస్తున్నారు. కొందరు నంబర్ కనిపించకుండా మాస్కులు కడ్తుంటే.. మరికొందరు ఒకట్రెండు అంకెలు కనిపించకుండా చెరిపివేస్తున్నారు. పోలీసులు ఎంతగా తనిఖీలు చేస్తున్నప్పటికీ ఈ వ్యవహారం ఆగకపోవడం శోచనీయం. ఇలా చేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను, క్షతగాత్రులను గుర్తించడం పోలీసులకు ఇబ్బందికరంగా మారుతుంది. పోలీసులు తరుచూ ఏకకాలంలో తనిఖీలు చేపట్టి నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.